క్లుప్తంగా

22 నుంచి రుద్రయాగం


వీరేశ్వరస్వామి

రాయవరం: మండలంలోని మాచవరం భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి నవశక్తి సహిత సుబ్రహ్మణ్య పూర్వక శ్రీరుద్రయాగం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ తెలిపింది. శ్రీదేవి శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శ్రీరుద్రయాగం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 22న అమ్మవారిని శైలపుత్రి, 23న బ్రహ్మచారిణి, 24న చంద్రఘంటా, 25న కుష్మాండ, 26న స్కందమాత, 27న కాత్యాయని, 28న కాళరాత్రి, 29న మహాగౌరి, 20న సిద్ధిధాత్రి, అక్టోబర్ 1న వారాహి అవతారంలో అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అక్టోబరు 2న పూర్ణాహుతి అనంతరం భద్రకాళి సమేత వీరేశ్వరస్వామికి శాంతి కళ్యాణం న్విహించనున్నట్లు తెలిపారు.

మోతాదుకు మించితే ముప్పు

కాజులూరు: ఖరీఫ్ వరి సాగు చేస్తున్న రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడితే పంటకు నష్టం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి అశోక్ అన్నారు. మండలంలోని చేదువాడ, తిప్పరాజుపాలెం, అయితపూడి, మంజేరు తదితర గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. క్షేత్ర స్థాయిలో రైతులకు పలు సూచన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు నానో యూరియా, డీఏపీలను వాడటం ద్వారా ఖర్చు తగ్గుతుందన్నారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది లోకేశ్వరి, సురేష్, గ్రేస్, హైమా తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

కాజులూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జె.రాంబాబు శనివారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై చర్చిస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం


వెదురుపాకలో విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న వీటీఏ ప్రతినిధులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో శనివారం గురుపూజోత్సవం నిర్వహించారు. వెదురుపాక టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంతులు రెడ్డి, లక్ష్మీగంగావతి కళ్యాణ మండపంలో ఉపాధ్యాయులను సత్కరించారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీ-2025లో ఉత్తమ ర్యాంకర్‌గా నిలిచిన షేక్ రషీద్‌తో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు నాగులాపల్లి వీరవెంకట సత్యనారాయణ, కొవ్వూరి బులిరెడ్డిను సత్కరించారు. కార్యక్రమంలో కోనాల సత్తిరాజు, హరిశాస్త్రి, డీజీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో అన్నదానం

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని 15వ వార్డు ధర్మగుండం చెరువు కాలనీలో గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మున్సిపల్ కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాసు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం


విశేషాలంకరణలో నల్లచెరువు వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారికి పటికి బెల్లం తులాభారం నిర్వహించారు.

కుక్కలు.. పీకేస్తున్నాయ్ పిక్కలు!

- వీధి కుక్కలతో బెంబేలెత్తిపోతున్న జనం
- ఇంటికే పరిమితమవుతున్న చిన్నారులు
- మాంసం దుకాణాలే ఆవాసం
- ప్రభుత్వ చర్యలు శూన్యం


అంగరలో గుమిగూడిన కుక్కలు


అంగరలో కుక్క కరిచిన వ్యక్తి కాలుకు గాయం


కుక్కల నివారణకై డిప్యూటీ ఎంపీడీఓకు వినతిపత్రాన్ని ఇస్తున్న అంగర ఉపసర్పంచ్ వీరన్నబాబు

కపిలేశ్వరపురం: కంటపడితే ఎక్కడ పిక్కలు పీకేస్తాయేమోననే భయంతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా వెంటపడి కరిచేస్తున్నాయి. కుక్కల బెడద ఎక్కువ అవడంతో తల్లిదండ్రులు చిన్నారులను సైతం బయటికి పంపించలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నారులను స్కూళ్లకు పంపేటప్పుడు కూడా దగ్గరుండి పిల్లలను తీసుకెళ్తున్నారు. మాంసం దుకాణాలను ఆవాసంగా చేసుకొని వీధుల్లో సంచరిస్తున్నాయి. కుక్కల బెడదపై అధికారులు చర్యలు తీసుకోవట్లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

సమస్య మరింత తీవ్రతరం

మండలంలోని అంగరలో ఈనెల 9న 30 ఏళ్ల యువకుడిని కుక్కలు ఒక్కసారిగా వెంటపడి కరిచాయి. చూసిన చుట్టు పక్కల వారు కుక్కలను చెల్లాచెదురు చేసి బాధితుడిని కపిలేశ్వరపురం సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు తీవ్ర గాయమైన కాలికి చికిత్స చేశారు. ఈ ఘటనకు సుమారు నెల రోజుల ముందు పడమర ఖండ్రికలోని బాలుడిపై కుక్కలు దాడి చేయబోగా.. చూసిన వారు కాపాడారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. కుక్కల బెడద ఒకప్పటిలా సాధారణ సమస్యగా లేదు. దాని తీవ్రత ప్రాణాలను తోడేసే స్థాయికి పెరుగుతూ ఉంది. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో శాస్త్రీయ పద్ధతిలో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

రెండు నియోజకవర్గాల్లో కుక్కల బెడద ఇలా...

మండపేట, రామచంద్రపురం పట్టణాలతో పాటు రెండు నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో కుక్కలు వీధుల్లో పదుల సంఖ్యలో గుమిగూడి జనాన్ని పరుగులు తీయిస్తున్నాయి. పరుగులు తీయిస్తుండటంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత 8 నెలల్లో రామచంద్రపురం పట్టణంలో సుమారు 335 మందిని, నియోజకవర్గంలోని గ్రామాల్లో సుమారు 301 మందిని కుక్కలు కరిచాయి. మండపేట నియోజకవర్గంలో సుమారు 572 మందిని కరిచాయి. 2024 గణాంకాల ప్రకారంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22,535 కుక్కలున్నట్టు అంచనా. 2,879 మంది కుక్క కాటు గాయాలతో వివిధ ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో చేరారు. గతేడాది ఒకరు మృతి చెందారు.

దుకాణాలే ఆవాస కేంద్రాలు

గ్రామాల్లోని కూడళ్లు, వంతెనలు వద్ద అనధికారికంగా మాంసం దుకాణాలు నిర్వహిస్తున్నారు. మాంసపు వ్యర్థాలను శివారుకు తరలించడానికి బదులు దుకాణం వద్ద బహిరంగంగా పడేస్తున్నారు. వాటిని తినేందుకు చేరిన కుక్కలు సమూహాలుగా సంచరిస్తున్నాయి. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు, తోపుడు బళ్ల వ్యాపార ప్రదేశాలు కుక్కలకు ఆవాస కేంద్రాలుగా ఉన్నాయి. అంగర ఊర చెరువు, వెదురుమూడి చర్చి సెంటర్‌లలో కుక్కలు గుంపుగా పరిగెత్తిస్తున్నాయి.

పరిష్కార మార్గాలివీ

కుక్కలను చట్ట పరిధిలో నివారించాల్సిన అవసరం ఉంది. అందుకోసం పంచాయతీ పశు వైద్య, ఆరోగ్య శాఖలను సమన్వయపర్చి కార్యాచరణకు దిగాలి. వీధి కుక్కలకు టీకాలు వేయించటం, ఏబీసీ (సంతాన నిరోధక) శస్త్ర చికిత్సలను చేయించడాన్ని ఉన్నతాధికారులు పరిష్కార మార్గాలుగా సూచిస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమిలా..

కుక్కల బెడద నివారణ చర్యలకై ప్రభుత్వం నుంచి పంచాయతీ అధికారులకు ప్రత్యేకమైన ఆదేశాలంటూ లేకపోవడం సమస్యకు ప్రధాన కారణం. కాకినాడ తదితర నగరాల్లో కార్పొరేషన్ అధికారుల చొరవతో పరిమిత సంఖ్యలో శస్త్ర చికిత్సలు చేయిస్తున్నప్పటికీ గ్రామాల్లో చర్యలు దాదాపు శూన్యం. ప్రభుత్వం శస్త్ర చికిత్సలకు ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. ఒక్కో ఆపరేషన్‌కు సుమారు రూ.1,300 ఖర్చవుతుందని అంచనా. శస్త్ర చికిత్సలు చేసే పశు వైద్యులను విస్తారంగా నియమించాలి. అందుకు అనువైనట్టుగా పశువుల ఆస్పత్రులను తీర్చిదిద్దాలి. కుక్కలను పశువుల ఆస్పత్రికి తరలించేందుకు పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో తగిన సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఈ రెండు ప్రధాన చర్యలనూ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని స్థానికులు అంటున్నారు.

కరిచిన వెంటనే ఇలా చేయాలి

కుక్క కరిచిన 90 రోజుల తర్వాత ఎప్పుడైనా రేబిస్ వ్యాధి బయట పడొచ్చు. వ్యాధి తీవ్రతను బట్టి మరణం సైతం సంభవించొచ్చు. కుక్క కాటుకు గురైన వారిలో అనేక మంది ఏఆర్‌వీ (రేబిస్ నియంత్రణ టీకా) వేయించుకుంటున్నారు. నిర్లక్ష్యం చేసిన వారు రేబిస్ వ్యాధి బారిన పడుతున్నారు. కుక్క కరిచిన వెంటనే కుళాయి ధార మాదిరిగా గాయంపై నీటిని పది నిమిషాలు పాటు వేయాలి. ఆ క్రమంలో సబ్బు, సెప్టిక్ లోషన్, స్టెరైల్ వాటర్‌లో ఏది అందుబాటులో ఉంటే దానితో గాయాన్ని శుభ్రం చేయాలి. కరిచినది పిచ్చి కుక్క అయితే మాత్రం గాయాన్ని కడగకుండా త్వరితగతిన వైద్యుని వద్దకు తీసుకెళ్లాలి. టీటీ చేయించిన తర్వాత పీహెచ్‌సీకి వెళ్లి ఏఆర్‌వీ వేయించాలి. వైద్యుని సూచనలపై క్రమం తప్పకుండా అన్ని డోసులు వేయించాలి.

అనుభవిస్తున్న వారికి తెలుస్తుంది



కుక్కలపై మానవత్వం చూపాలంటూ అనేక మంది ప్రకటనలు చేస్తుంటారు. దాని పట్ల వారికే కాదు మరెవ్వరికీ భిన్నాభిప్రాయం ఉంటుందని అనుకోను. కానీ కుక్క కాటుకు గురైనవారు అనుభవించే బాధను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. అంగరలో పలువురు కుక్క కాటుకు గురయ్యారు. ప్రభుత్వం సరైన రీతిలో ఆలోచన చేసి కుక్కలను నియంత్రించే కార్యాచరణకు పూనుకోవాలి. శాస్త్రీయంగా సమస్యను పరిష్కరించాలంటూ డిప్యూటీ ఎంపీడీఓ మోహన్‌కు వినతిపత్రం అందజేశాను. అది అత్యవసరం.

– యర్రా వీరన్నబాబు, ఉప సర్పంచ్, అంగర

పీఆర్ సమితి ఉద్యోగుల సంఘం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన పీఆర్ సమితి మంత్రిత్వ ఉద్యోగుల సంఘం

రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో పూర్వపు రాయవరం సమితి మంత్రిత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎ.గోవింద్, రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి.రమేష్, జిల్లా నాయకులు ప్రసాద్, భాస్కర్ ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. సమితి యూనిట్ అధ్యక్షుడిగా వీఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా సాయిబాబా, ప్రధాన కార్యదర్శిగా గోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.మంగరాజు, జాయింట్ సెక్రటరీగా టీవీ విశ్వనాథ్, ట్రెజరర్‌గా టి.వరప్రసాద్, జిల్లా కౌన్సిలర్లుగా కె.మల్లేశ్వరరావు, పి.అరుణ్‌సాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంత్రిత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో రాయవరం, రామచంద్రపురం, బిక్కవోలు, అనపర్తి మండలాలకు సంబంధించిన మంత్రిత్వ సిబ్బంది హాజరయ్యారు.

పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలి

కపిలేశ్వరపురం (మండపేట): త్వరితగతిన పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మండపేట శాఖ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండపేటలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం అసోసియేషన్ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఆలమూరు ఎస్‌టీఓతో చర్చించిన విషయాలను, అసోసియేషన్ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ, డీఏ, డీఆర్ వివరాలను కార్యదర్శి గోవిందరావు, హెల్త్ కార్డులు మంజూరుకు సంబంధించిన వివరాలను నేమాని సూర్య భాస్కరారావు వివరించారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, ప్రసాద్, పర్వతిన భాస్కరరావు, దొరకయ్య పాల్గొన్నారు.

భజన గురువు ‘పెండ్యాల’ మృతి తీరని లోటు


సంతాప సభలో మాట్లాడుతున్న వక్తలు

రామచంద్రపురం రూరల్: ప్రముఖ భజన గురువు, తిరుమల తిరుపతి దేవస్థానం సలహాదారుడు, వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు మృతి తీరని లోటు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలోని పైడావారి అన్న సత్రం భవనంలో శనివారం నాగేశ్వరరావు మాస్టారు సంతాప సభ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. 77 ఏళ్ల వయస్సులోనూ అలుపెరుగని ఆధ్యాత్మిక సేవలు అందించారన్నారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గడచిన 10 సంవత్సరాలుగా ఏటా క్రమం తప్పకుండా సప్తాహం నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన స్వయంగా భజన బృందాలను తయారు చేయడమే కాకుండా ఎన్నో భజన బృందాలకు మార్గదర్శకత్వం వహించి ప్రోత్సహించేవారన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది భజన కళాకారులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జానపద వృత్తి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కై రం వీరవెంకట సత్యనారాయణ(సతార్ స్వామి), రంగంపేట వీరన్న చౌదరి, పెద్దాపురం నీలం శ్రీనివాసు, వడిశలేరు నెహ్రూ, వేళంగి శారద, రాజమహేంద్రవరం తులసమ్మ, వేట్లపాలెం నాగు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గంలో వివాదాల పరిష్కారమే లక్ష్యం


లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

రామచంద్రపురం: వివాదాలను శాంతియుతంగా రాజీమార్గంలో పరిష్కరించడమే లోక్ అదాలత్ ప్రధాన లక్ష్యమని రామచంద్రపురం మండల లోక్ అదాలత్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987 ప్రకారం లోక్ అదాలత్‌కు చట్టబద్ధమైన హోదా ఉందన్నారు. లోక్ అదాలత్ ద్వారా ఇచ్చే తీర్పులు అంతిమమైనవని తెలిపారు. కేసుల పరిష్కారానికి మీడియేషన్‌లో శిక్షణ పొందిన నలుగురు న్యాయవాదులను నియమించామన్నారు. ఈ లోక్ అదాలత్‌లో 17 సివిల్ కేసులు, 126 క్రిమినల్ కేసులు వెరసి 143 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. వీటి విలువ రూ.1,42,78,311 ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉండవల్లి గోపాలరావు, బొడ్డు వరాహ నరసింహమూర్తి, ట్రెజరర్ చింత పల్లి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, పలివెల సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు ఆర్‌వీజీ సుబ్బారావు, పి. జానకి, ఎల్వీ కమల్ కుమారి, సూరంపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినికి సత్కారం


ఉపాధ్యాయురాలు దైవకృప దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ నాగరాజు తదితరులు

కె.గంగవరం: మండల పరిధిలోని కూళ్ల గ్రామ పంచాయతీ శివారు నరజాడ ప్రాథమిక పాఠశాలలో నాలుగేళ్లు ఉపాధ్యాయురాలిగా పనిచేసి బదిలీపై వెళ్లిన దైవకృప దంపతులను విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సమర్థత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కోరారు. ఉపాధ్యాయురాలిగా దైవకృప సేవలను కొనియాడారు. అనంతరం దైవకృప దంపతులను శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు దాసరి శ్రీను, గుణవంతుడు, హెచ్ఎం ప్రేమ్‌కుమార్, మల్లి, పులిదిండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏచూరి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి


కాజులూరులో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాజులూరు: సోషలిస్ట్ సిద్ధాంతాలు, ఫెడరల్ వ్యవస్థ కోసం నిర్విరామంగా పోరాడిన ఏచూరి సీతారాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ సూచించారు. కాజులూరులో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వక్కు రాజబాబు ఆధ్వర్యంలో శనివారం ఏచూరి సీతారాం వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లౌకిక వ్యవస్థ, రాష్ట్రాల హక్కుల కోసం దేశంలోని అన్ని పార్టీలను ఏకతాటిపై తీసుకువచ్చిన గొప్ప దార్శనికుడు ఏచూరి అని కొనియాడారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు యాళ్ల నరసింహమూర్తి, కడలి రాంపండు, షేక్ మీరా, పిల్లి శ్రీను, కె.మేరి, పద్మావతి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కన్వీనర్ వీరబాబు

కె.గంగవరం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ నిర్వహించే సేవా పక్షోత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కన్వీనర్ సలాది వీరబాబు పిలుపునిచ్చారు. మండలంలోని అముజూరులో శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు అధ్యక్షతన పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పక్షోత్సవాలకు కన్వీనర్‌గా అవసరాల నారాయణమూర్తి, కో కన్వీనర్లుగా సలాది రామకృష్ణ, కొప్పిశెట్టి చంద్రరావులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 17న ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలలు, దేవాలయాలను శుభ్రం చేసి శానిటేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుర్రాల సత్యనారాయణ, ఏవీ రమణమూర్తి, కేవీ కృష్ణ, సలాది శేఖర్, సున్న సత్యనారాయణ, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు


దుగ్గుదుర్రు-ఉప్పుమిల్లి రోడ్డులో రక్షణ గోడలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రు-ఉప్పుమిల్లి రహదారిలో డ్రైన్‌పై కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. సుమారు 16 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టుకు అప్పట్లో ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించకుండా వదిలివేశారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టుకు ఇరువైపులా రోడ్డు మలుపు తిరిగి ఉంది. రాత్రి సమయాల్లో వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారుల ద్వారా కూటమి నేతల అబద్ధపు ప్రకటనలు

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో రైతులను యూరియా కొరత పట్టి పీడిస్తుందన్న వాస్తవాన్ని కప్పి పుచ్చుకునేందుకు కూటమి నేతలు అధికారులతో తప్పుడు ప్రకటనలు చెప్పిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ చైర్మన్ కామన ప్రభాకరరావు శనివారం ఓ ప్రకటనలో అన్నారు. యూరియా సరఫరా సమస్య పరిష్కారానికై ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. కూటమి నేతలు, అధికారులు చెబుతున్నట్టు రాష్ట్రంలో యూరియా స్టాక్ సరిపడినంత ఉన్నట్టయితే రైతులు యూరియా కోసం క్యూలైన్లలో ఎందుకు పడిగాపులు కాస్తున్నారని కామన ప్రశ్నించారు. రైతులు చేస్తున్న ఆందోళనలే యూరియా కొరతకు, కూటమి ప్రభుత్వం చేతకాని పాలనకు నిదర్శనమన్నారు. రైతు సాగు చేస్తున్న భూమి విస్తరణ ఆధారంగా కాకుండా ఆధార్ కార్డు వారీగా యూరియాను సరఫరా చేయడం అక్రమ విక్రయాలకు మార్గాన్ని సుగమం చేయడమే అన్నారు. రైతులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే యూరియా కొరత సమస్యను పరిష్కరించాలని కామన డిమాండ్ చేశారు.

ఆధునిక నాటక యుగకర్త ఆత్రేయ


ఆత్రేయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

అమలాపురం టౌన్: మనసు కవి ఆచార్య ఆత్రేయ సినీ గేయ రచయితగానే కాకుండా గొప్ప నాటక రచయితగా ఎన్నో ఆదర్శవంతమైన, స్ఫూర్తిదాయకమైన నాటికలు రాశారని శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి అన్నారు. అందుకే ఆత్రేయ ఆధునిక నాటక యుగకర్త అయ్యారన్నారు. స్థానిక దాబా గార్డెన్స్‌లో శ్రీశ్రీ కళావేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆచార్య ఆత్రేయ వర్ధంతి సభలో కవి నరసింహమూర్తి మాట్లాడారు. తొలుత ఆత్రేయ చిత్రపటానికి కోనసీమ రచయితల సంఘ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవి నరసింహమూర్తి ‘మనసు కవి మహా కవి ఆత్రేయ’ అనే కవితను సభలో వినిపించారు. శ్రీశ్రీ కళావేదిక సహాయ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీపాద రామకృష్ణ, సాహితీ అభిమానులు కడలి సత్యనారాయణ, చిక్కాల రవిశంకర్, కోళ్ల పద్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వం సమాజ గమనానికి ఆయుధం


మండపేటలో పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

కపిలేశ్వరపురం (మండపేట): ఆరోగ్యకరమైన పోటీతత్వం మెరుగైన మానవ సమాజ గమనానికి ఆయుధమని 49వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభ కార్యక్రమంలో వక్తలన్నారు. మండపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం పోటీలు ప్రారంభమయ్యాయి. ఏపీ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అప్పసాని కృష్ణకుమారి పర్యవేక్షణలో ఎస్‌వీఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగకుమార్ అధ్యక్షతన ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ నూక దుర్గారాణి జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యాల బాల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి చింతా రవివర్మ, కోశాధికారి, ఇండియా రిఫరీ కుంచె రమేష్ తదితరులు పోటీల నిర్వహణలో సేవలందించారు. 17 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు రెండు రోజులపాటు గెలుపుకోసం తలపడతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, నిర్వాహక కమిటీ సభ్యులు ముంగర వెంకటరాజు, గెడా శ్రీనివాస్, పాల్గొన్నారు.

విద్యుత్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయాలి


రాజోలు బస్టాండ్ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రాజోలు: విద్యుత్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసి నిర్వహించాలని కోరుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో శనివారం రాజోలులో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు రాజోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద యూనియన్ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో విద్యుత్ బస్సులను ప్రైవేటు వ్యక్తులకు కేటాయిస్తున్నాయన్నారు. బస్సుల కొనుగోలు ద్వారా వచ్చే సబ్సిడీ ప్రైవేటు వ్యక్తులకే పోతుందన్నారు. అలా కాకుండా ఆర్టీసీ విద్యుత్ బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వ్యక్తులు సంస్థలోకి చొరబడితే భవిష్యత్‌లో సంస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. దీనికి సంబంధించిన జీఓ 88ను తక్షణమే ఉపసంహరించాలని కోరారు. అధ్యక్షుడు నారాయణ, ఎస్‌కేఏ ఖలీల్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.